# "వెలుగోకోతి"



"సత్యంచంద్రవాటి"

నేను ఆఫీసులోకి ప్రవేశించేసరికి బ్రేక్ యిన్‌స్పెక్టర్ భూపతి సిగరెట్ త్రాగుతూ ఏదో ఫైలు చూసుకుంటు న్నాడు.

నన్ను గమనించలేదో, గమనించి చూడ [illegible] అర్థం కాలేదు. కాని తలెత్తకుండా ఏదో వ్రాసుకుంటున్నాడు.

రెండు నిముషాలు అలాగే నిలుచుని సన్నగా దగ్గాను.

ఆయన తల ఎత్తాడు—

'గుడ్‌మార్నింగ్ సార్!' అన్నాను.

'గుడ్‌మార్నింగ్—' [illegible] అంటూనే తను చూస్తున్న ఫైలులో మునిగిపోయాడు.

కాసేపాగి 'మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తు న్నట్టున్నాను. క్షమించాలి!' అన్నాను.

ఆయన మళ్లీ తల ఎత్తాడు.

నేను ఒక లారీ [illegible]

రిజిస్ట్రేషన్ చేయించి, ఫిట్‌నెస్ టెస్ట్ చేయిస్దామని వచ్చాను. కాగితాలు యిచ్చి మూడు రోజులయింది. మీరు కొంచెం దయవుంచి త్వరగా పని పూర్తిచేస్తే.'

ఆయన కొంచెం విసుగ్గా చూశాడు—'కాగితాలు యిచ్చారుకదా-తొందరపడతారేం—ఆఫీసు ప్రొసీజర్ ప్రకారం కొంచెం. ఆలస్యం అవుతుంది మరి — రెండ్రోజు లాగిరండి—'

'అదికాదు సార్ — ఆ లారీ నడవక పోవటంవల్ల నేను రోజూ చాల డబ్బు నష్టపోతున్నాను. మొన్న లారీని చూపి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిస్తారనుకున్నాను. ఆరోజు చూడలేదు. నిన్న చూస్తానన్నారు కాని చూడలేదు. కనీసం యివాళయినా...'

ఇంతలో స్ప్రింగ్ డోర్స్ తెరుచుకుని పొడుగ్గా, బలంగా, చామన ఛాయగా వున్నాయన హుందాగా లోపలకు అడుగు పెట్టాడు—

వస్తూనే నవ్వుతూ 'నమస్తే—భూపతి గారూ!' అన్నాడు.

అంటూనే కుర్చీ ముందుకు లాక్కుని కూర్చున్నాడు.

ఆయన ఎవరో నాకు బాగా తెలుసు. దాదాపు పది బస్సులకు, నాలుగయిదు లారీలకు అధిపతి పట్టణంలో వున్న గొప్పవాళ్లల్లో ఒకడు. పేరు అంకినీడు.

'ఊరకరారు మహానుభావులు— ఏదో పెద్దపనిమీదే వచ్చినట్టున్నారే అంకినీడు గారు-' అన్నాడు భూపతి నవ్వుతూ.

'మీతో మాకు వేరే పనేముంటుంది సార్!' అంటూ ఆయనే నవ్వాడు.

భూపతి బల్లమీద మూడుకోతుల బొమ్మ వుంది. దానిమీద చెడు వినకు, చెడు చూడకు, చెడు చెప్పకు అని వ్రాసివుంది. బొమ్మ మంచి అందంగానే కాక నీ అదాయ కంగా కూడా వుంది.

అది చూస్తూ అన్నాడు అంకినీడు "గాంధీగారి బొమ్మ పెట్టారే—అయినా ఏం నీతులులెండి ఈకాలంలో...' అదోరకంగా నవ్వాడు.

భూపతి అన్నాడు 'ప్రజలదేం తప్పు లేదంటాను — చెడువినద్దు, చూడవద్దు, చెప్పవద్దు అనే మూడు కోతులు చెబుతున్నాయి కాని, చెడు చేయవద్దు అని చెప్పే నాలుగో కోతి ఏది — అందుకే అందరూ చెడ్డపనులు చేస్తున్నారు-బాగు పడుతున్నారు.'

అంకినీడు పెద్దగా నవ్వాడు—ఆయన హాస్యానికి.

భూపతి తన ముందున్న సిగరెట్ పెట్టెను అంకినీడుకి అందించాడు.

అంకినీడు సిగరెట్ వెలిగించి, నిర్లక్ష్యంగా పొగ వదులుతూ అన్నాడు 'ఒక చిన్నపని తగిలిందిసార్—మన నైన్‌టీన్ ట్వెంటీనైన్ లేదూ—దానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలి!'

భూపతి పెద్దగా నవ్వాడు.

'ఫిట్‌నెస్సా—ఆ డొక్కు సిటీబస్సుకా—ఏమన్నా బాగుచేయించారా—యింకా అలాగే నడుస్తున్నదా—'

అంకినీడు కూడా చిన్నగా నవ్వాడు.

'రిపేరా—భలేవాళ్లుసార్ మీరు. దానికి రిపేరు— మొదలుపెడితే నాలుగయిదువేల రూపాయలు యిట్టే తినేయదుటండీ—ఆఁ—ఏదో రోడ్డుమీద నడుస్తున్నదిగదా—నడవనీయండి—యిప్పుడంత డబ్బు నేనెక్కడ తేను?'—

'మరయితే నేను ఫిట్‌నెస్ నీలా యిస్తాననుకున్నారు!' అన్నాడు భూపతి.

అంకినీడు నవ్వాడు.

ఈలోగా భూపతి నాకేసి తిరిగి 'మీ లారీ బయట వున్నదా!' అన్నాడు.

లేచి నిలబడి 'వుంది సార్—చూస్తారా' అన్నాను.

'బయట వుండండి — కాసేపట్లో వస్తాను!' అన్నాడు భూపతి.

ఒక నమస్కారం పారేసి బయటకు వచ్చాను.

అంతా హడావిడిగా వుంది. ఎంతోమంది చేతిలో రిజిస్ట్రేషన్ పుస్తకాలతోనూ, టోకెన్స్‌తోనూ — హడావిడిగా తిరుగుతున్నారు. ఒక గంట గడిచింది. నా ఎదురుగానే అంకినీడు కారెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత అరగంటకి భూపతి బయటకు వచ్చాడు. బయట వున్న కొన్ని వెహికిల్స్ అసలు చూడనేలేదు. ప్రక్కనే వున్న డ్రయివర్లతో—'ఫిట్‌నెస్సు అయిపోయింది—బండి తీసుకు వెళ్ళి పోవచ్చు' అని చెప్పాడు. అంటే బండి చూడకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తయారయి పోయిందన్నమాట. కొన్ని వెహికల్స్ కేవో వంకలు పెట్టాడు.

'మీ లారీ ఏది!' అడిగాడు బ్రేక్ యిన్‌స్పెక్టర్.

చూపించాను. ఎక్కి స్టార్టు చేసాడు, స్టార్టు అయింది. కొంచెం ముందుకూ వెనక్కూ రెండుమూడు సార్లు నడిపాడు. సడన్‌గా బ్రేక్ కొట్టాడు. తక్కున ఆగింది. క్రిందకు దిగి నంబర్ ప్లేట్లూ అవీ చెక్ చేశాడు. నన్ను పిలిచి-స్టాప్ బోర్డు సరిగ్గా వ్రాయించలేదన్నాడు. అది చాల ముఖ్యం అన్నాడు. స్టాప్ బోర్డు లైటు కూడా సరిగ్గా లేదన్నాడు. బ్రేకు గట్టిగా పట్టుకుంటున్నదిట. అది బాగు చేయించా లన్నాడు. రియర్ వ్యూ అద్దం మరీ చిన్నదయింది — సరిగ్గా కనపడటం లేదు — పెద్దది వేయించమన్నాడు.

అన్నిటికీ సరేనన్నాను.

'అన్నీ బాగుచేయించి-రేపూ ఎల్లుండీ శెలవు కనుక—సోమవారం తీసుకురండి—అప్పుడు చూద్దాం — ఇటువంటి బళ్లు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కావాలని ప్రాణం తీస్తారు!' సణుగుతూ లోపలకు వెళ్ళి పోయాడాయన.

కాసేపు నాకేం చేయాలో తెలియలేదు.

చుట్ట కాలుస్తూ బయట నుంచున్న ప్యూన్ నన్ను చూసి అదోలా నవ్వాడు. చుట్ట పారేసి మెల్లగా నా దగ్గరకు వచ్చాడు.

'ఏం సార్—పనయిందా! అయ్యగారు ఏమన్నారు—మీ ముఖం చూస్తే తెలియటం లేదాసార్ పనయిందో లేదో — మీరు నే చెపితే వినరు సార్—మీరు 'ఊఁ!' అనండి—అయిదు నిమిషాల్లో మీ పని పూర్తిచేయక పోతే నన్నండి—ఇప్పుడు వచ్చిన అంకినీడు గారు చూడండి. ఆయన డొక్కు బస్సుని యిక్కడకు తేకుండానే—అయ్యగారు చూడకుండానే సర్టిఫికేట్టు సంపాదించుకున్నారు—చూశారా. ఆయనగారు వచ్చారంటే వెంటనే పని చేయించుకు పోతారు. ఆయనకూ మాకూ కూడా హాయి. మీరు యిన్నాళ్ళ నుంచీ తిరుగుతూ...'

అతని మాటలు వినకుండా ముందుకు నడిచాను. అక్కడ పని ఆవాలంటే ఏం చేయాలో కూడా తెలుసు. అంత అమాయకుడినేం కాదు. కానీ నా ఆశయాలకు

అది నిరుద్ధం.

ఇన్ని రోజుల నుంచీ నా లారీ నడవక పోవటం వల్ల నష్టం నా మదిలో మెదిలింది. ఏం డబ్బు యిస్తే పని త్వరగా అవుతుంది గదా అని అడుగుతున్నాడు నా లోని మనిషి. మళ్ళీ ప్రిన్స్‌పల్ అడ్డం వచ్చింది. అందుకే ప్యూన్‌తో ఏమీ అన కుండా బయటకు వచ్చాను.

వెనక అతను సణగటం వినబడుతూనే వుంది.

మూడు రోజుల తర్వాత ఆయన చెప్పిన 'రిపేర్లు' చేయించి మళ్ళీ వచ్చాను.

అదేం ఖర్మమో కాని-నేను భూపతి దగ్గరకు వెళ్ళిన మరుక్షణంలోనే—లోపలకు హడావిడిగా వచ్చాడు అంకినీడు. మనిషి కొంచెం గాభరాగా వున్నాడు.

కుర్చీ లాక్కుని కూర్చుని — దీనంగా చూశాడు భూపతివేపు.

భూపతి వింతగా చూశాడతన్ని.

'కొంప అంటుకున్నాయి సార్—మా బస్సుకి ఏక్సిడెంటు అయింది!' నుదుటికి పట్టిన చెమటను, చేతి రుమాలుతో తుడుచుకున్నాడు.

భూపతి ఆసక్తిగా చూశాడు — 'ఏ బస్సుకి' అడిగాడు

'మొన్న మీరు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ యిచ్చిందే-నైన్‌టీన్ ట్వంటీనైన్...'

భూపతి కొంచెం కలవరపడ్డట్టు కని పించాడు. మెల్లగా అన్నాడు — 'ఏక్సిడెంట్

# నాలుగో కోతి

ఎలా అయింది ?'—

అంకినీడు నాలికతో, ఎండిన పెదవులు ఒక్కసారి తుడుపుకుని అన్నాడు-'ఏం లేదు సార్ — మెయిన్‌రోడ్డు మీద సెంటర్‌లో మా సిటీ బస్సు వెడుతున్నదట. రూల్సు ప్రకారం ఎడమ ప్రక్కనే వెడుతున్నాడు. సడన్‌గా గేదె ఒకటి అడ్డం వచ్చిందిట. బ్రేక్ కొడితే పడలేదు. గేదె మీదకు బస్సు ఎక్కుతుందేమోనని, చటుక్కున కుడి ప్రక్కకు త్రిప్పాడుట బస్సుని. ఆ స్పీడుకి, బస్సు—అలా చటుక్కున త్రిప్పటంతో, కంట్రోల్ తప్పి—కుడి పక్కన వున్న సిటీ బస్సు స్టాపులోకి దూసుకు పోయిందిట. అక్కడా మళ్ళీ బ్రేక్ కొట్టినా పడలేదు. బస్టాపులో బస్సుకోసం నుంచున్న నలుగురు స్కూలుకు వెళ్ళే అమ్మాయిలమీదా ఎక్కి, తర్వాత గోడకు గుద్దుకొని ఆగిందిట...' అంకినీడు ఆగాడు.

'ఆ నలుగురు చిన్నపిల్లలకూ దెబ్బలు తగల్లేదు కదా—' అడిగాను కంగారుగా.

అంకినీడు ఒక క్షణం మాట్లాడలేదు. కాసేపటికి అన్నాడు: 'అంత వేగంగా వెడుతున్న బస్సు పసిపిల్లల మీద ఎక్కితే దెబ్బలు తగిలినయ్యా అంటారేమిటి సార్—నలుగురు అమ్మాయిలూ బస్సు క్రింద పడి నలిగిపోయారు-వెంటనే ప్రాణం పోయింది.'

నాకు నోట మాట రాలేదు. హృదయంలో ఏదో కెలుక్కుమంది.

'మరి పోలీసులు కేసు బుక్ చేయలేదా!' అడిగాడు భూపతి.

'చేశారు—కాని మా బావమరిది ట్రాఫిక్ యిన్‌స్పెక్టర్‌ని ఈ పాటికి కలుసుకునే వుంటాడు. ఎంతడిగినా సరే యిచ్చేయమని చెప్పాను. అతను మేనేజ్ చేయగలడు సార్—అక్కడేం ఫరవాలేదు...'

భూపతి ఏం మాట్లాడలేదు.


'వాళ్ళ రిపోర్టుతోపాటు బ్రేకులు పని చేస్తున్నాయనీ, బస్సు కండిషన్‌లోనే వుందని మీరు సర్టిఫికేట్ యిస్తే—ఈ కేసును మాఫు చేయవచ్చు. దయచేసి మీరు...'

వాళ్ళ మాటలు వినపడుతున్నా; నాకు మనసులో ఏదో భారంగా వుంది, మా అమ్మాయి స్కూలుకి వెళ్ళే సమయం సరిగ్గా అదే. కొంపతీసి ఈ బస్సు పొట్టన పెట్టుకున్న నలుగురు పాపల్లో మా అమ్మాయి వుందా—ఏదో వణుకు ప్రారంభమయింది. తక్కున లేచి—ఒక చకా మెయిన్ రోడ్డు సెంటర్‌వేపు బయల్దేరాను.

నడుస్తున్నానే కాని నా ఆలోచనలు చాలా వెర్రిగా, పిచ్చి పిచ్చిగా వున్నాయి. కాళ్ళు తడబడుతున్నాయి.

సెంటర్‌లో చాలామంది జనం గుంపుగా వున్నారు. పోలీసులూ వున్నారు. కంగారును అణచుకుంటూ, జనాన్ని ప్రక్కకు తోసి—లోపలకు వెళ్ళాను. గుండె వేగంగా కొట్టుకుంది. ఆ దృశ్యాన్ని చూడలేకపోయాను. కళ్ళు మూసుకున్నాను. ఒక ప్రక్క ఆ చనిపోయినవారిలో మా అమ్మాయి లేదన్న ఆనందం వున్నా — ఆ హృదయ విదారక దృశ్యం చూసి మనసంతా వికలమయి పోయింది. కళ్ళల్లోకి నీళ్ళు వచ్చినయి. ఒక క్షణం ఆగి కళ్ళు తెరిచాను.

బస్సు ముందు చక్రాల క్రింద నలుగురు పసిపాపలూ నలిగిపోయారు. ముఖాలు కొంచెం గుర్తు తెలుస్తున్నా ఆ లేత శరీరాలు పచ్చడి అయిపోయాయి. నెత్తురు మడుగులో నిశ్చలంగా పడి వున్నాయి. ఆ నలుగురూ పది సంవత్సరాల లోపువాళ్ళే. పదేళ్ళ లోపలే వాళ్ళకి నూరేళ్ళు నిండి పోయాయి. మృత్యువు వాళ్ళని జయించింది. కబళించింది— అంతకన్నా అన్యాయ



కులు దొరకలేదేమో:

ఇంతలో హఠాత్తుగా గుర్తుకు వచ్చింది— ఆ అమాయకపు పిల్లల చావుకు కారణమెవరో, ఏమిటో. ఈ లోపలే అంకినీడు భూపతికి కొన్ని వచ్చి కాగితాలు అందించే వుంటాడు. ఆయన బస్సు కండీషన్‌లోనే వుందని సర్టిఫికేట్ యిస్తాడు. అంకినీడు బావమరిది పోలీసుల దగ్గర మేనేజ్ చేస్తాడు. అందరూ కలిసి—బస్సువాళ్లదేం తప్పులేదని—ఏదో కారణం చూపిస్తారు. అంతటితో ఈకేసు కొట్టివేయ బడుతుంది. అంకినీడు ఒకసారి జేబు తడుముకుని, హాయిగా వూపిరి పీల్చుకుంటాడు. భూపతి ఆదాయం పెరుగుతుంది అతను ఆడబ్బు ఆనందంగా ఖర్చు పెట్టుకుంటాడు. కాని అతను ఖర్చుపెట్టే ప్రతిపైసాకీ నాలుగు ప్రాణాలు జమకట్టు కున్నాడు. నాలుగు పసి, అమాయక ప్రాణాలను బలివేస్తున్నారంతా కలసి—దేనికోసం— డబ్బుకోసం— కేవలం డబ్బుకోసం.

నా ఆలోచనలకు అంతరాయం కలిగింది. కారు హారన్ వినగానే. అంకినీడూ, భూపతి వచ్చారు గబగబా. అంకినీడు, భూపతికీ చూపించాడు ప్రమాదం జరిగిన చోటును.

భూపతి బస్సునుంచున్నతీరునీ, ఆపసి పాపల్నీ చూశాడు. ఉలిక్కిపడి మళ్లీ చూశాడా పాపల్ని, కొయ్యబారిపోయాడు. అంకినీడు ఏదో అంటున్నా అతనికి వినపడటంలేదు. ఒకక్షణం తర్వాత తేరుకుని—గబగబా ముందుకు వెళ్లాడు. ఆ నలుగురు పాపల్లోనూ మధ్యన—బస్సు క్రింద నలిగి ప్రాణాలను పోగొట్టుకున్న వీరటి, అందమైన పాప తల మీద చేయి వేశాడు. ప్రేమగా చూశాడు. ఒక్కసారిగా 'సుజాతా!' అని పెద్దగా అరిచి, ఆ అమ్మాయి మీద పడి విలపించాడు — బ్రేక్ యిన్స్పెక్టరు భూపతి.


నాకేం అర్థం కాలేదు:

చివరో అంటున్నారు—'ఆ అమ్మాయి బ్రేక్ యిన్స్పెక్టరుగారి అమ్మాయా—అరే ...పాపం... యనకు ఒక్కతే కూతురు. కాన్పు అప్పుడు ఆపరేషన్‌చేసి ఆ అమ్మాయిని బయటకుతీసి, ఆయన భార్యకు యిక మళ్లా పిల్లలు పుట్టరని చెప్పారుట డాక్టర్లు; అందుకని పాపం—ఈ అమ్మాయిని చాలా అపురూపంగా, గారాబంగా, కంటికి రెప్పలా...'

నాకు తర్వాత మాటలు వినపడలేదు బయటకు వచ్చేశాను.

అక్కడవున్న వేపచెట్టు మీద కాకులు కోతులు దంతులు వేస్తున్నాయి. ●

# ముక్తి ఎప్పుడు కలుగుతుంది!



బులుసు వేంకటరమణయ్య — ధర్మపథం

ముక్తి అంటే జన్మ రాహిత్యమే — అంటే—ఆ మీద మరి పుట్టుక అనేది లేకుండా జీవాత్మ పరమాత్మలో ఐక్యాన్ని పొందడమే!

జన్మ పరంపరకు కారణం వ్యక్తి చేసుకున్న కర్మలు. ఏ కర్మలూ— అంటే— పనులూ చెయ్యకుండా మానవులు స్థాణువులుగా ఉండిపోలేరు. కర్మలు చెయ్యకుండా ఉండడం సాధ్యం కాదు.

మనం చేసే కర్మలలో మంచి ఉంటాయి. చెడ్డవీ వుంటాయి. మంచికార్యాలవల్ల పుణ్యం లభిస్తుంది. చెడ్డ పనులమూలంగా పాపాన్ని సంపాదించుకుంటాం. మనం చేసిన కర్మలయొక్క ఫలాన్ని మనం అనుభవించక తప్పదు. ఆ కర్మలవల్లనే జన్మలు కలుగుతవి.

భగవంతుణ్ణి ప్రార్థించేవారు సాధారణంగా తమకు సిరి సంపదలు, ఇల్లు వాకిళ్లూ, ధనధాన్యాలు కావాలని కోరుకుంటారు. వాటిపైని ఆసక్తి లేనివారు తమ పాపాలను క్షమించి, పుణ్యాన్ని అనుగ్రహించాలని ప్రార్థిస్తారు. జన్మరాహిత్యానికి పాపం ఎలా సాధనం కాదో, పుణ్యం కూడా ఆ రీతినే సాధనం కాదనీ తెలుసుకున్నవారు తక్కువ.

అట్టి జ్ఞానం కలవారు ప్రార్థించే విధం యిది—

'పాతకప్రచయవన్మమ తావత్
పుణ్యపుంజమపి నథ లునీహి,
కాంచనీ భవతు లోహమయీ వా
శృంఖలా యది పదోర్న విశేషః.'

'ఓ భగవంతుడా! నా పాపాల నన్నిటినీ నశింపజేసినట్లుగా పుణ్యాలను కూడా పూర్తిగా లేకుండా చెయ్యి. ఏమంటే — పుణ్యాలుకూడా పాపాలవలెనే బంధకారణాలే కాని వేరు కాదు. కాళ్లకు సంకెళ్లు వేసినప్పుడు— అవి ఇనుప సంకెళ్లయితేనేమి? బంగారు సంకెళయితేనేమి? ఏమయినా సంకెళ్లు సంకెళ్లేగదా!' అని దీని అభిప్రాయం.

మనం చేసుకున్న కర్మలయొక్క ఫలం అనుభవించడానికి ఎన్ని జన్మలయినా ఎత్తవలసి వుంటుంది. ఒక జన్మలో చేసుకున్న కర్మయొక్క ఫలం ఆ జన్మలో పూర్తిగా అనుభవానికి రాకపోతే, ఆ అనుభవంకోసం మరో జన్మ ఎత్తవలసినదే! ఈ విధంగా మిగులు లేకుండా పాప,పుణ్యకర్మల ఫలం అనుభవించినప్పుడే ముక్తి కలుగుతుంది.

అందుకోసం మనం భగవంతుణ్ణి ప్రార్థించవలసినది పాప,పుణ్యాలు రెండూ పూర్తిగా లేకుండే రీతిని చేయుమని మాత్రమే! ●